క్లుప్తంగా

రాష్ట్రస్థాయి పోటీలకు నెల్లేపల్లె విద్యార్థినులు


విద్యార్థినులతో ఉపాధ్యాయులు

గంగాధర నెల్లూరు : మండలంలోని నెల్లెపల్లె ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థినులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయిని సుబ్బరత్నమ్మ తెలిపారు. బుధవారం ఆమె మాట్లాడుతూ పదోతరగతి విద్యార్థిని యామిని వాలీబాల్‌కు, 9వ తరగతి విద్యార్థిని గగన ఫుట్‌బాల్‌కు, 8వ తరగతి విద్యార్థినులు కుసుమ, కీర్తిక, భవ్యశ్రీ హాకీ క్రీడకు ఎంపికైనట్లు వెల్లడించారు. ఎంపికైన విద్యార్థినులను సహాయ హెచ్‌ఎం యుగంధర్ ఆచారి, వ్యాయామ ఉపాధ్యాయులు రజని, లక్ష్మయ్య అభినందించారు.

ఆరిమాని గంగమ్మ హుండీ లెక్కింపు

శ్రీరంగరాజపురం : మండలంలోని తయ్యూరు పాయికట్టు ఆరిమాకులపల్లెలో వెలసిన ఆరిమాని గంగమ్మ ఆలయ హుండీ లెక్కింపును బుధవారం చేపట్టారు. ఈఓ తిమ్మారెడ్డి మాట్లాడుతూ దసరా ఉత్సవాల సందర్భంగా అమ్మవారికి భక్తులు రూ.1,75,590 కానుకలు సమర్పించినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ లింగారెడ్డి, జెడ్పీటీసీ సభ్యులు రమణప్రసాద్‌రెడ్డి, ధనంజయులు, సిద్ధయ్య శెట్టి, వెంకటరమణ, నరసింహులు నాయుడు, జనార్దన్ నాయుడు పాల్గొన్నారు.

సుబ్బరాయన్ సేవలు అభినందనీయం


మాట్లాడుతున్న డీవైఈఓ ప్రభాకర్‌రాజు

పుత్తూరు: ప్రధానోపాధ్యాయులుగా సుబ్బరాయన్ సేవలు అభినందనీయమని పుత్తూరు డీవైఈఓ ప్రభాకర్‌రాజు అన్నారు. బుధవారం గోపాలకృష్ణాపురం జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎంగా ఉద్యోగ విరమణ పొందిన సుబ్బరాయన్‌కు సన్మాన సభ నిర్వహించారు. ముఖ్య అతిథిగా డీవైఈఓ మాట్లాడారు. 11 ఏళ్ల పాటు పాఠశాల మంచి ఉత్తీర్ణత శాతం సాధించడంలో సుబ్బరాయన్ విశేష కృషి చేశారని ఆయన సేవలను ప్రస్తుతించారు. కార్యక్రమంలో ఎంఈఓలు తిరుమలరాజు, బాలసుబ్రమణ్యం, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

అనారోగ్యంతో అటెండర్ మృతి


విజయపురం (వడమాలపేట) : వడమాలపేట మండల పరిషత్ కార్యాలయంలో అటెండర్‌గా పనిచేస్తున్న కే.రజిని(42) బుధవారం మృతి చెందారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన తన స్వగృహమైన పుత్తూరు మండలం సీటీఆర్ నత్తంలో మృతి చెందారు. ఎంపీడీఓ శేషగిరి రావ్, సిబ్బంది రజిని కుటుంబానికి సంతాపం వ్యక్తం చేస్తూ నివాళులర్పించారు.

వడమాలపేటలో ఆధార్ సేవలు


ఆధార్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీఓ

విజయపురం (వడమాలపేట): ఆధార్ కార్డులో మార్పులు–చేర్పులకోసం ఆధార్ సేవలు సద్వినియోగం చేసుకోవాలని వడమాలపేట ఎంపీడీఓ శేషగిరి రావు కోరారు. వడమాలపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థుల సౌలభ్యం కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక ఆధార్ కేంద్రాన్ని బుధవారం ఆయన పరిశీలించి మాట్లాడారు. మండలంలో పలు ప్రత్యేక ఆధార్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఈనెల 25వ తేది వరకు ప్రత్యేక కేంద్రాలు పనిచేస్తాయని, ముఖ్యంగా విద్యార్థులు ఆధార్ కార్డుల్లో ఏవైనా తప్పిదాలు ఉన్నపక్షంలో సరిచేసుకోవచ్చన్నారు.

భూ సమస్యల పరిష్కారమే లక్ష్యం


అర్జీలు పరిశీలిస్తున్న తహసీల్దార్ అరుణ కుమారి

పాలసముద్రం : భూ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ అరుణ కుమారి తెలిపారు. బుధవారం ఆముదాలలో సర్పంచ్ అనురేఖ, రీ సర్వే డీటీ ప్రవీణ్ కుమార్‌తో కలిసి గ్రామ సభ నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ గ్రామ సభలో 65 మంది రైతులు భూ సమస్యలపై అర్జీలు అందజేసినట్లు వెల్లడించారు. పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో సర్వేయర్ గణేష్, వీఆర్‌ఓ శంకర్ పాల్గొన్నారు.

బెల్ట్ లహరి.. గ్రామాలు ఇక చిత్తు మరి

- పుత్తూరు ఎక్సైజ్ పరిధిలో 18 షాపులకు అనుమతి
- 232 గ్రామాల్లో 300పైగా బెల్ట్ షాపులకు రంగం సిద్ధం
- ఒక్కో బెల్ట్ షాపుకు రూ.లక్ష డిపాజిట్!
- బెల్ట్ షాపు పేరిట లైసెన్స్ లేని మద్యం షాపు



గతంలో తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు రాష్ట్రాన్ని స్వర్ణాంధ్రప్రదేశ్‌గా మార్చడమే తమ లక్ష్యమంటూ విజన్–2020 పేరిట అప్పటి సీఎం నారా చంద్రబాబునాయుడు ఎంతగా హడావుడి చేశారో ప్రజలకు అనుభవపూర్వకంగా విదితమే. ఇప్పుడు కూటమి ప్రభుత్వంగా అధికారంలోకి వచ్చాక స్వర్ణాంధ్ర నినాదాన్ని అటకెక్కించేశారు. దాని స్థానంలో మద్యాంధ్రప్రదేశ్ గళం అందుకున్నట్టు ప్రైవేట్ మద్యం పాలసీ పేరిట అమలు చేస్తున్న విధానాలు స్పష్టం చేస్తున్నాయి.


మద్యం బాటిళ్లు

పుత్తూరు: కూటమి ప్రభుత్వం ప్రైవేట్ మద్యం షాపులను తీసుకురావడంలో విజయవంతంగా తొలి అడుగు వేసింది. మలి విడతగా గ్రామ గ్రామాన బెల్ట్ షాపులు తెరిచేందుకు అనధికార అనుమతులు సైతం జారీ చేస్తోంది. ఇందుకు ఆయా నియోజకవర్గాల అధికార పార్టీ నాయకుల సిఫార్సుల మేరకు బెల్ట్ షాపులకు అనుమతిలిస్తున్నారు. పుత్తూరు ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో పుత్తూరు మండలంలో 7 షాపులకు, నారాయణవనం 3, వడమాలపేట 4, రామచంద్రాపురం 4 చొప్పున మొత్తం 18 మద్యం షాపులకు ప్రభుత్వం అనుమతించింది. తెలుగు తమ్ముళ్లు సిండికేట్ అయ్యి, సామ దాన దండోపాయాలతో మద్యం షాపులను దక్కించుకున్నారు. ఇతరులు కొన్ని షాపులు దక్కించుకున్నా చివరకూ వాటినీ కబ్జా చేసి 'మద్యహాసం' చేస్తున్నారు.! ప్రస్తుతం టీడీపీ నాయకులు, కార్యకర్తలు గ్రామ గ్రామాన బెల్ట్ షాపుల ఏర్పాటులో తలమునకలై ఉండటంతో గ్రామీణ మహిళలు ఆందోళన చెందుతున్నారు. ఇవేవీ పట్టించుకోని నాయకులు జేబులు నింపుకోవడమే పరమావధిగా ఈ నాలుగు మండలాల్లోని 232 గ్రామాల్లో బెల్ట్ షాపుల ఏర్పాటుకు నువ్వా, నేనా? అంటూ తీవ్రంగా పోటీ పడుతున్నారు. కొన్ని గ్రామాల్లో రెండుకు పైగా షాపులు నడిపేందుకు ముందుకువస్తున్నారు. దీంతో పుత్తూరు స్టేషన్ పరిధిలో 300కు పైగా బెల్ట్ షాపులు ఏర్పాటు కానున్నాయి. ఇదే అదనుగా షాపు యజమానులు బెల్ట్ షాపుల కోసం వస్తున్న వారి నుంచి రూ.లక్ష డిపాజిట్ వసూలు చేస్తున్నట్లు సమాచారం. షాపు యజమానులు సిండికేట్‌గా ఏర్పడి లాటరీ ఫీజు, లైసెన్స్ ఫీజు, షాపు అద్దె, సిబ్బంది వేతనాల రూపంలో అయ్యే ఖర్చును రాబట్టేందుకు బెల్ట్ షాపులను ఆదాయ వనరులుగా మలచుకుంటున్నారు. గతంలో బెల్ట్ షాపుల్లో కేవలం చీప్ లిక్కర్ మాత్రమే విక్రయించేవారు. ఇప్పుడు బెల్ట్ షాపుల్లో బీర్లతో సహా అన్ని రకాల బ్రాండ్లను అందుబాటులోకి తేనున్నారు. పేరుకు బెల్ట్ షాపు అయినప్పటికీ వాస్తవానికి లైసెన్సు లేని మినీ మద్యం షాపు అంటే అతిశయోక్తి కాదేమో మరి! ఇప్పటికే పలు గ్రామాల్లో బెల్ట్ షాపులు నిర్వహిస్తున్నారు. మద్యం షాపులు ఉదయం 10నుంచి రాత్రి 10 గంటల వరకే నిర్వహించాల్సి ఉండగా అర్ధరాత్రి వరకూ అమ్మకాలు సాగిస్తున్నారు. సిట్టింగ్ రూమ్స్ ఏర్పాటు చేసి విచ్చలవిడిగా తాగిస్తున్నారు.

నాడు ఇలా

గత వైఎస్సార్‌సీపీ పాలనలో ఐదేళ్ల పాటు మద్యం దుకాణాలన్నింటినీ ప్రభుత్వ ఆధీనంలోనే నిర్వహించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చే సమయానికి ఉన్న 4,380 మద్యం షాపులను 2,934కు పరిమితం చేశారు. అవికూడా ప్రభుత్వ షాపులుగా ఏర్పాటు చేసి, ప్రభుత్వానికి మాత్రమే ఆదాయం అందేలా చేశారు. కేవలం నిర్ణీత సమయాల్లో మాత్రమే అమ్మకాలు జరిగేవి. బెల్ట్ షాపులనేవే లేకుండా చేశారు.

నేడు ఇలా

ఇప్పటి కూటమి ప్రభుత్వం 3,396 షాపులతో మళ్లీ ప్రైవేటు పాలసీని తీసుకొచ్చింది. ఈ మొత్తం షాపుల కింద మరో 50 వేల బెల్ట్ షాపులతో రాష్ట్ర వ్యాప్తంగా మద్యం ఏరులై పారడం తథ్యంగా కనిపిస్తోంది. ఎక్సైజ్ శాఖ నిబంధనలను తుంగలో తొక్కి సమయ పాలన, ఎమ్మార్పీ రేట్లు, సిట్టింగ్ రూమ్స్ వంటి నిబంధనలను పక్కన పెట్టి జోరుగా మద్యం విక్రయాలు కొనసాగిస్తున్నారు.

కుశస్థలి నదిని పరిశీలించిన తహసీల్దార్

- ఎక్కడి నుంచైనా ఉచిత ఇసుక తీసుకుపోవచ్చని స్పష్టం

సాక్షి ఎఫెక్ట్..

విజయపురం : మండలంలోని కేవీ శ్రీరామపురం వద్ద కుశస్థలి నదిని తహసీల్దార్ కిరణ్ బుధవారం పరిశీలించారు. మంగళవారం సాక్షి దినపత్రికలో 'తమ్ముళ్ల ఇసుక దందా ' శీర్షికతో ప్రచురించిన కథనంపై ఆయన స్పందించారు. కేవీ శ్రీరామాపురంలోని కుశస్థలి నది ప్రాంతంలో పర్యటించారు. ఆయన మాట్లాడుతూ, ఎవరికైనా ఇసుక అవసరం ఉంటే ఎద్దుల బండి, ట్రాక్టర్‌లో తరలించుకోవచ్చని, రెవెన్యూ అధికారుల నుంచి ఎలాంటి అనుమతి పొందనవసరం లేదని స్పష్టం చేశారు. తామెవరికీ పర్మిట్లు ఇవ్వడం లేదని చెప్పారు. ప్రభుత్వం ప్రకటించినట్లు ఎక్కడ నుంచైనా ఉచితంగా ఇసుకను తీసుకోవచ్చని, ట్రాక్టర్ ఇసుకను రూ. 5వేలకు అమ్ముతుంటే వారి వద్ద తీసుకోరాదని, ఎవరైతే తక్కువ ధరకు ఇస్తారో వారి వద్దే ఇసుక పొందాలని ఆయన చెప్పారు.

కార్యదర్శులకు రిలీవింగ్, జాయినింగ్ ఆర్డర్

ఇటీవల సాధారణ బదిలీపై వచ్చిన పంచాయతీ కార్యదర్శులకు ఎంపీడీఓ రమణప్రకాష్ రిలీవింగ్, జాయినింగ్ ఆర్డర్ ఇచ్చారు. ఈ నెల 21న సోమవారం సాక్షి దినపత్రికలో 'కార్యదర్శుల బదిలీ పంచాయతీ' శీర్షికతో ప్రచురించిన కథనంపై ఎంపీడీఓ స్పందించారు. రాత్రికి రాత్రే ఆర్డర్ సిద్ధం చేసి పంచాయతీ కార్యదర్శులకు రిలీవింగ్, జాయినింగ్ ఆర్డర్స్ ఇచ్చారు. దీంతో పంచాయతీ కార్యదర్శులు ఊపిరి పీల్చుకున్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

- మండల సమావేశంలో ఎంపీపీ దీప


సమస్యలను ప్రస్తావిస్తున్న సభ్యుడు

నింద్ర: మండలంలోని ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయ కృషి చేయాలని ఎంపీపీ దీప అన్నారు. బుధవారం నింద్ర మండల సర్వసభ్యుల సమావేశం నిర్వహించారు. అధ్యక్షత వహించి ఆమె మాట్లాడుతూ, మండలంలోని వివిధ గ్రామాల్లో తాగునీటి సమస్య, పారిశుధ్యం సమస్యలు లేకుండా చూడాలని అన్నారు. మండలంలో రైతులకు పెసలు, మినుములు అందుబాటులో ఉన్నాయని, సబ్సిడీపై వీటిని రైతులకు ఇవ్వనున్నట్లు మండల వ్యవసాయాధికారి తులసీరాం అన్నారు. ఉపాధి హామీ పథకం కింద 35 మంది రైతులకు ఉద్యాన పంటలు సాగు చేసే దిశగా చర్యలు తీసుకున్నామన్నారు. ఉపాధి ఏపీఓ మాట్లాడుతూ, శనివారం సామాజిక తనిఖీ బహిరంగ సభ నిర్వహించనున్నట్టు చెప్పారు. కావునూరులో ప్రజలకు ఆర్వో ప్లాంట్ ఏర్పాటు చేయాలని ఎంపీటీసీ సభ్యుడు విజేష్ కోరారు. ప్రభుత్వం నూతనంగా 'గోకులం' లబ్ధిదారుల ఎంపిక విషయంలో స్థానిక ప్రజాప్రతినిధులకు సమాచారం ఇవ్వలేదని వైద్యాధికారిని పలువురు ఎంపీపీటీసీ, సర్పంచులు ప్రశ్నించారు. ఇసుక పాలసీ సక్రమంగా అమలు చేసి, అవసరమైన వారికి ఇసుక సక్రమంగా అందే చర్యలు తీసుకోవాలని కో–ఆప్షన్ సభ్యుడు అనిల్ కోరారు. పంచాయతీల్లో పారిశుధ్యం, వీధి దీపాలు, తాగునీటి సమస్యలు లేకుండా చూడాలని ఈఓపీఆర్డీ లక్ష్మీపతి కోరారు. వైద్యాధికారిణి నిరోష మాట్లాడుతూ, మండలంలో కుక్క కాటుకు 90 మందికి టీకాలు వేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ శుభా, దుర్గాదేవి, ఎంపీడీఓ శివప్రసాద్‌శర్మ, హౌసింగ్ ఏఈ శ్రీధర్‌రాజు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సురాజ్ శర్మ, ఇరిగేషన్ ఏఈ లోకేశ్వర్‌రెడ్డి, ఎంఈఓ వసుమతి, పీఆర్ ఏఈ వీరభద్రం, ఎంపీటీసీలు, సర్పంచులు, సచివాలయ, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన

- క్యాన్సర్‌పై మహిళలకు అవగాహన


మాట్లాడుతున్న అధికారులు

పుత్తూరు: రాష్ట్రీయ సేవా సమితి (రాస్) వివిధ సేవలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని స్థానిక వ్యవసాయ శాఖ విస్తరణాధికారి చంద్రశేఖర్ కోరారు. బుధవారం స్థానిక ఎన్జీఓ కాలనీలో రాస్, టాటా ట్రస్ట్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. 80 మంది మహిళలకు రక్తపోటు, మధుమేహం, హెపటైటిస్–బి, నోటి, రొమ్ము, గర్భాశయం క్యాన్సర్లకు సంబంధించి పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు.. అనంతరం టాటా ట్రస్ట్ డాక్టర్ వెంకయ్య బాబు మాట్లాడుతూ, క్యాన్సర్ వ్యాధిపై మహిళలు అవగాహన కలిగి ఉండాలని, ఆరోగ్యం విషయంలో శ్రద్ధ వహించాలన్నారు. క్యాన్సర్‌ను తొలి దశలోనే గుర్తిస్తే దానిని జయించవచ్చన్నారు.మహిళల్లో గర్భ సంచి, రొమ్ము, నోటి క్యాన్సర్లపై అవగాహన కల్పించారు. తొలుత ముఖ్య అతిథిగా చంద్రశేఖర్ మాట్లాడారు. కృషి విజ్ఞాన కేంద్రం ద్వారా రైతులకు, మహిళల కోసం పలు చేతి వృత్తుల ఉచిత శిక్షణా తరగతులు, ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తున్న రాస్ సేవలు అభినందనీయమన్నారు. శిబిరంలో డాక్టర్లు అమరావతి, రెడ్డికుమారి, మహేంద్ర, వైద్య సేవలందించారు. కార్యక్రమంలో రాస్ సిబ్బంది ప్రకాష్, కమలమ్మ తదితరులు పాల్గొన్నారు.

అలసత్వం వహిస్తే చర్యలు


సీసీ రోడ్డు పనులు పరిశీలిస్తున్న ఎంపీడీఓ కృష్ణమహేష్‌రెడ్డి

పాలసముద్రం : సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించాలని, విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని ఎంపీడీఓ కృష్ణమహేష్‌రెడ్డి స్పష్టం చేశారు. బుధవారం కృష్ణజమ్మపురం గ్రామ సచివాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎంపీడీఓ మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల ప్రకారం సచివాలయ ఉద్యోగులు నిష్పక్షపాతంగా పనిచేయాలని సూచించారు. సంక్షేమ, అభివృద్ధి పథకాలను అర్హులందరికీ అందించాలని కోరారు. ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఆదేశించారు. అనంతరం గ్రామంలో చేపట్టిన సీసీ రోడ్డు పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కార్యక్రమంలో మండల విస్తరణాధికారి రమేష్, ఇంజినీరింగ్ అసిస్టెంట్ జయరాజ్ పాల్గొన్నారు.

పైపులైను పగిలి తాగునీటికి కటకట

- కేబుల్ పనులతో దెబ్బతిన్న వైనం
- మరమ్మతులు చేయిస్తామని డబ్బులు పుచ్చుకున్న టీటీడీ నాయకుడు
- పనులు చేయకపోవడంతో అవస్థలు పడుతున్న ప్రజలు

విజయపురం: ఇల్లత్తూరు నుంచి కేశవపురం ఆది ఆంధ్రవాడకు ఉన్న తాగునీటి పైపులైను పగిలిపోవడంతో నీటి కోసం గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ నెల 8వ తేది ఓ ప్రైవేటు సంస్థ కేబుల్ కోసం గుంత తవ్వుతుంటే పైపులైను పగిలిపోయింది. అప్పటి నుంచి ఇప్పటి వరకు వాటిని మరమ్మతులు చేయలేదు. అంతే కాకుండా కేశవపురం గ్రామానికి చెందిన ఓ టీడీపీ నాయకుడు ఆ సంస్థ దగ్గర పైపులైను మరమ్మతు కోసం డబ్బులు తీసుకొన్నట్లు గ్రామస్తులు తెలిపారు. అయితే డబ్బు తీసుకొన్న ఆ టీడీపీ నాయకుడు ఇప్పటివరకూ మరమ్మతులకు పూనుకోకపోవడంతో ఆదిఆంధ్రవాడ గొంతెండుతోంది. మండల స్థాయి అధికారుల దృష్టికి తీసుకెళ్లినా స్పందించడం లేదని ప్రజలు మండిపడుతున్నారు. తాగునీటి సమస్య నేపథ్యంలో వ్యవసాయ బావుల వద్దకు పరుగు తీస్తున్నారు. జిల్లా అధికారులైనా స్పందించి చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరారు.

క్వారీలు రద్దు చేయాలని ఆందోళన చేస్తాం


సమావేశంలో మాట్లాడుతున్న నాగరాజు

నగరి: నగరి సమీపంలోని క్వారీలను రద్దు చేయాలని సీపీఐ చిత్తూరు జిల్లా కార్యదర్శి ఎస్ నాగరాజు డిమాండ్ చేశారు. బుధవారం సీపీఐ పట్టణ కార్యదర్శి వేలన్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తరతరాలుగా మూగజీవాల పెంపకం, వ్యవసాయంపై ఆధారపడిన రైతులతోపాటు ప్రజలకు కూడా క్వారీల పనులు నష్టం కలిగిస్తాయని అధికారులకు నివేదించినట్టు చెప్పారు. అయినా అధికారులు పట్టించుకోకపోవడం దురదృష్టకరమన్నారు. ఈ నేపథ్యంలో క్వారీలను మూసివేయాలనే డిమాండ్‌తో నవంబర్ 4న ఆర్డీవో కార్యాలయం ఎదుట నిరసన దీక్ష చేస్తామన్నారు. సమావేశంలో పార్టీ నాయకులు షబ్బీర్ బాషా , ఎన్ విజయ్‌కుమార్, శేఖర్, ఏఐటీయూసీ పట్టణ నాయకులు చందామరై, టీ శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకంగా విధులు


మాట్లాడుతున్న వ్యవసాయ శాఖ ఏడీ సౌభాగ్యలక్ష్మి

గంగాధర నెల్లూరు : రైతు సేవాకేంద్రాల్లోని సిబ్బంది పారదర్శకంగా విధులు నిర్వర్తించాలని వ్యవసాయశాఖ ఏడీ సౌభాగ్యలక్ష్మి కోరారు. బుధవారం జీడీ నెల్లూరు వ్యవసాయశాఖ కార్యాలయంలో సమాచార హక్కు చట్టంపై సిబ్బందికి అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ ఆర్‌టీఐ నిబంధనల మేరకు ప్రజలు అడిగే ప్రతి సమాచారం అందించాలని ఆదేశించారు. సమావేశంలో ఏఓలు భవాని, నర్మద, ఢిల్లీ ప్రసాద్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ వ్యక్తి మృతి

పుత్తూరు: ఈనెల 13న పుత్తూరులో జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ పి.గోపి(45) తిరుపతి రుయాలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. ఎస్‌ఐ ఓబులయ్య కథనం.. పుత్తూరు మండలం దిగువ కనకంపాళెంకు చెందిన గోపి మోటర్ సైకిల్‌పై వెళుతుండగా ఫ్లిప్‌కార్ట్‌కు చెందిన వ్యాన్ ఢీకొంది. వ్యాన్ డ్రైవర్ సంతోష్‌ను అదుపులోకి తీసుకుని పోలీసులు కేసు నమోదు చేశారు.

రోడ్డు నిర్మాణానికి భూ పరిశీలన


భూమిని పరిశీలిస్తున్న ఆర్‌డీఓ శ్రీనివాసులు

శ్రీరంగరాజపురం : మండలంలోని తయ్యూరు కొక్కిరలకొండలో ఉన్న డీఆర్‌డీపీ కేంద్రానికి చిత్తూరు తచ్చూరు జాతీయ రహదారి నుంచి లింకు రోడ్డు నిర్మాణానికి ఆర్‌డీఓ శ్రీనివాసులు బుధవారం భూ పరిశీలన చేపట్టారు. ఆర్‌డీఓ మాట్లాడుతూ భూ నిర్వాసిత రైతులకు నష్ట పరిహారం అందిస్తామని తెలిపారు. త్వరితగతిన భూసేకరణ పూర్తి చేయాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. రోడ్డు పనులకు రైతులు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్ లోకనాథపిళ్లై, ఆర్‌ఐ గోపి పాల్గొన్నారు.

పారిశుధ్యం అధ్వానం

- పైపులైను లీకేజీతో బురదమయం


పైపులైన్ లీకేజీతో వృధా అవుతున్న నీరు

విజయపురం: విజయపురం మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో పారిశుధ్యం అధ్వానం ఉంది. ఇక్కడ కార్యాలయ ఆవరణలో తాగునీటి ఓవర్ ట్యాంక్ ఉంది. పైపులైన్ లీకేజీ కావడంతో చుట్టు పక్కల బురదమయమైంది. రోజుల తరబడి నీళ్లు నిలిచిపోవడంతో పాచి పట్టి అధ్వానంగా మారింది. నిత్యం అధికారులు తిరుగుతున్నా , పైపులైను లీకేజీతో నీరు వృధా అవుతున్నా అధికారులు, ఉద్యోగులు పట్టించుకోవడం లేదని వివిధ పనుల నిమిత్తం కార్యాలయానికి వచ్చే ప్రజలు మండిపడుతున్నారు.


బురదమయమైన ఎంపీడీఓ కార్యాలయ ఆవరణ

ప్రజాస్వామ్య నిర్మాణంలో యువత పాత్రే కీలకం


సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్

నగరి : శక్తివంతమైన ప్రజాస్వామ్యాన్ని నిర్మించడంలో యువత పాత్రే కీలకమని మున్సిపల్ కమిషనర్ కృష్ణారెడ్డి అన్నారు. బుధవారం నూతన ఓటర్ల నమోదుపై స్థానిక ప్రభుత్వ డిగ్రీకళాశాలలో ప్రిన్సిపల్ డాక్టర్ వేణుగోపాల్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజాస్వామ్యంలో భాగస్వామ్యం కావడానికి ఓటర్‌గా నమోదు కావడం మొదటి మెట్టు అన్నారు. 18 ఏళ్లు నిండిన విద్యార్థులు ఓటు హక్కుకు నమోదు చేసుకోవాలని పిలుపునిచ్చారు. 18, 19 ఏళ్లు నిండి ఇప్పటికీ ఓటరుగా నమోదు కాని వారు బీఎల్‌వో ద్వారా వెంటనే నమోదు చేయించుకోవాలన్నారు. దీనినిగాను 10వ తరగతి మార్కుల జాబితా, ఆధార్ కార్డు, ఫొటో తీసుకొని రావాలని కోరారు. కార్యక్రమంలో నగరి టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ మూర్తి, కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ భాస్కరరాజు, ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ గోపి, నగరి యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా మేనేజర్ యువరాజ్ తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛందంగా ఆక్రమణలు తొలగించండి


సమీక్షిస్తున్న చైర్మన్, కమిషనర్, అధికారులు

నగరి: స్వచ్ఛందంగా ఆక్రమణలు తొలగించేందుకు రెండ్రోజులు గడువు ఇస్తున్నామని, దీనిని దృష్టిలో ఉంచుకుని ఆక్రమణలను ప్రజలే తొలగించాలని మున్సిపల్ కమిషనర్ కృష్ణారెడ్డి విజ్ఞప్తి చేశారు. మున్సిపాలిటీ పరిధిలోని ప్రాంతాల్లో ఆక్రమణల తొలగింపు అంశంపై మున్సిపల్ చైర్మన్ పీజీ నీలమేఘం ఆదేశాల మేరకు బుధవారం మున్సిపల్ కమిషనర్ అధికారులతో సమీక్షించారు. ప్రధాన రహదారులైన తిరుపతిరోడ్డు, నాగలాపురం రోడ్డు, పళ్లిపట్టు రోడ్డులలో మురుగు నీటి కాలువలను దాటి పలువురి నిర్మాణాలు ఉన్నాయని, అలాగే కాలువలను ఆక్రమించి నిర్మాణాలు చేశారని, పీసీఎన్ ఉన్నత పాఠశాల ప్రహరీ చుట్టూ ఉన్న మున్సిపాలిటీ స్థలం ఆక్రమణలకు గురవుతోందని చర్చించారు. అంతిమంగా పైవిధంగా నిర్ణయం తీసుకుని ప్రకటించారు. ఆ లోపు ఆక్రమణలు తొలగించకుంటే అధికారులే కార్యాచరణకు పూనుకుని ఆక్రమణలు తొలగిస్తారని కమిషనర్ హెచ్చరించారు. సమావేశంలో ఆర్‌ఓ, టీపీఓ, శానిటరీ ఇన్‌స్పెక్టర్ తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ.. నివాళి


భాస్కర్‌రెడ్డితో మాట్లాడుతున్న నారాయణస్వామి, కృపాలక్ష్మి


నాగరాజకుప్పంలో నివాళులర్పిస్తున్న రామ్‌ప్రసాద్‌రెడ్డి

పాలసముద్రం : సింహరాజుపురం సర్పంచ్ భాస్కర్ రెడ్డిని బుధవారం మాజీ డిప్యూటీ సీఎం నారాయణ స్వామి, వైఎస్సార్‌సీపీ జీడీ నెల్లూరు నియోజకవర్గం ఇన్‌చార్జి కృపాలక్ష్మి పరామర్శించారు. ఆయన ఆరోగ్య స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ తులసి యాదవ్, ఎంపీటీసీ సభ్యుడు గోవిందరాజు, సర్పంచ్ మహేష్, అయ్యప్ప, పోలయ్య, సుబ్రమణ్యరెడ్డి, పుత్తూరు కేశవరెడ్డి, విజయరాఘ వరెడ్డి, మాజీ సర్పంచ్ గణేష్ రెడ్డి, షణ్ముగ రెడ్డి, బాబు, వేణు, లోకిదాస్, తిరుమల, సుబ్రమణి, రవిరెడ్డి,గురుప్రసాద్,ధనంజయులు, కృష్ణయ్య, చిన్నబ్బరాజు పాల్గొన్నారు.

ఈచంబాడిలో..

కార్వేటినగరం: మండలంలోని ఈచంబాడి గ్రామంలో మృతి చెందిన జేసీఎస్ మండల కన్వీనర్ పురంధర్ మేనల్లుడు లక్ష్మణ్(26) భౌతికకాయానికి మాజీ ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి నివాళులర్పించారు. కుటుంబీకులను ఓదార్చి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. వైఎస్సార్‌సీపీ గంగాధరనెల్లూరు నియోజకవర్గ ఇన్‌చార్జి కృపాలక్ష్మి, ఎంపీపీ లత, సర్పంచ్ ధనంజయవర్మ పాల్గొన్నారు.

నాగరాజకుప్పంలో..

నగరి: మండలంలోని నాగరాజకుప్పంకు చెందిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు శేఖర్ తల్లి బుధవారం రాత్రి ఆకస్మిక మరణం పొందారు. ఆయన స్వగృహానికి వెళ్లిన వైఎస్సార్ సీపీ నాయకుడు రామ్‌ప్రసాద్ రెడ్డి మృతదేహంపై పూలమాల వేసి నివాళులు అర్పించారు. శేఖర్‌ను ఓదార్చారు. కార్యక్రమంలో ఎంపీపీ భార్గవి, వైస్ ఎంపీపీ కన్నియప్ప, ఎంపీటీసీలు, సర్పంచులు పాల్గొన్నారు.

లోక కల్యాణార్థం హోమ పూజలు


హోమ పూజలు నిర్వహిస్తున్న పీఠాధిపతి

నగరి: మున్సిపల్ పరిధి కీళపట్టు చంద్రమౌళీశ్వర ఆలయంలో నూతనంగా నిర్మించిన స్వర్ణాకర్షక భైరవ, శ్రీఓందేవి, ప్రత్యంగిర వరాహి, శరబేశ్వర సన్నిధిలో మండల పూర్తి హోమ పూజలు బుధవారం వైభవంగా నిర్వహించారు. శ్రీ ఓం పంచాక్షరి పీఠాధిపతి పూజ్యశ్రీ జ్ఞానశక్తియేంద్రస్వామి ఆధ్వర్యంలో హోమపూజలు, పూర్ణాహుతి నిర్వహించారు. లోక కల్యాణం కోసం హోమపూజలు నిర్వహించినట్లు ఆలయ నిర్వాహకులు సుబ్రమణ్యం తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.